నిరసన చేపడుతున్న నాయకులు

పేరుకే ప్రభుత్వ కార్యాలయం

- అంతా ప్రయివేటు వసూళ్ల మయం
- సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో హవా నడిపిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు
- నిద్రావస్థలో జిల్లాఉన్నతాధికారులు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

అవినీతి అడ్డాగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తయారయింది. ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి చేతివాటం ప్రదర్శించడం సిబ్బందికి అలవాటయింది. అదనంగా డబ్బు ముట్ట చెప్పకపోతే గంటలో కావాల్సిన పని రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే.

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అక్టోబర్ 2020 నుంచి ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పై స్టాంప్ డ్యూటీని సవరించింది. సవరణ ప్రకారం స్టాంప్ డ్యూటీ అనేది నమోదైన ప్రతి అమ్మకంపై రాష్ట్ర ప్రభుత్వం విధించే లావాదేవీల విలువ శాతం. దాని ప్రకారం లెక్కగటి చెల్లించాలి. ఆలెక్కలు ఉంటాయి. కాని ప్రతిపనిలో అదనంగా చెల్లించకుంటే ఎక్కడిపని అక్కడే ఉంటుంది.

ప్రతి పనికీ ఒకరేటు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతిపనికి ఒక రేటు ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. దస్తావేజుల రిజిస్టేషన్ లకు మార్కెట్ వాల్యు పైనసేల్ డిడి అయితే స్టాంప్ డ్యూటీ 5శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ సుంకం 1.5 శాతం, రిజిస్ట్రేషన్ చార్జీలు ఒక శాతం, మొత్తం 7.5 శాతం చెల్లించాలి. ఇదే గిఫ్ట్ డిడి అయితే స్టాంపు డ్యూటీ 2 శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 0.5శాతం

కనీసం రూ. వెయ్యి గరిష్టం రూ.10,000 వరకు చెల్లించాలి. పై చార్జీలు ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉండగా ఒక్కో డాక్యుమెంట్పై పై రూ.2000 నుంచి రూ.3000 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్టు తెలిసింది. నిబంధన మేరకు లొసుగులు ఉన్న పక్షంలో కనీసం రూ.3000 నుంచి గరిష్టంగా రూ.15000 వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఉదాహరణకు మీరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్ళినట్లయితే రూ.మూడు లక్షల విలువగల దస్తావేజులకు మొత్తం అన్ని పన్నులు కలుపుకొని రూ. పదివేల వరకు చెల్లించవలసి ఉంటుంది. అయితే సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం వలన అదనంగా రూ.5000 నుండి రూ.10000 వరకు వసూలు చేస్తున్నారు. లోసుగులు ఉన్న దస్తావేజులకు అదనంగా వసూలు చేస్తున్నట్టు సమాచారం.

ఇక్కడ సమాచార హక్కు చట్టం 2005 వర్తించదా ?

ఈ కార్యాలయంలో లభించు వివరాలకు సంబంధించిన సమాచారం అడుగుటకు ఏ అధికారిని సంప్రదించాలో తెలియదు. పౌర సమాచార అధికారి ఎవరు ? అప్పిలేటు అధికారి ఎవరో తెలియదు?

పేరుకే సిటిజన్ చార్టర్

గోడకు సిటిజన్ చార్టర్ అతికించారు ఒక్కో పనికి ఎంత సమయం పడుతుంది అనేది స్పష్టంగా అతికించారు. భూముల దస్తావేజుల రిజిస్టేషన్‌లను చేసుకునేందుకు గరిష్టంగా 24 గంటలు ఈసీ జారీ ఒక గంట అలాగే ఈసీ నకలు మాన్యువల్‌గా ఇచ్చేందుకు 24 గంటలు, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్‌కు గంట, పెండింగ్ డాక్యుమెంట్లు ఇచ్చేందుకు ఒకరోజు భూముల మార్కెట్ వాల్యుయేషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఒక గంటల సమయం ఇవన్నీ నామమాత్రంగానే ఉన్నాయి. ముడుపులు చెల్లిస్తే పనులు జరుగుతాయి. లేదంటే రోజులు తరబడి కార్యాలయాలు చుట్టూ తిరగవలసి వస్తుంది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్టేషన్‌కు అదనంగా అడుగుతున్నారు

- రమణ వెంకటగిరి గ్రామ నివాసి

ఐదు సెంట్లు స్థలం రిజిస్టర్ చేయించుకోవడానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాను. డాక్యుమెంటు రైటర్లు రూ.60,000 చెల్లించమని చెబుతున్నారు. అంతడబ్బు ఎలా చెల్లించాలి.

ఎవరూ అదనంగా డబ్బు వసూలు చేయరు

- తేజేశ్వరి, సబ్ రిజిస్ట్రారు, కోడుమూరు

ఎవరిని అదనంగా డబ్బులు అడుగుతున్నారో వారిని మాకు చూపించండి. ఇక్కడ భూమి విలువను బట్టి వసూలు చేస్తాం.

చండీఘర్ విద్యుత్ డిస్కం

ప్రయివేటీకరణను ఆపాలి

- సిఐటియు నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

చండీఘర్ రాష్ట్ర ప్రభుత్వం డిస్కంను ప్రయివేటు సంస్థ ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కు అమ్మడానికి డిసెంబర్ 4న ఆ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని వెంటనే నిలిపి వేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలు కొత్త బస్టాండ్ సుందరయ్య సర్కిల్ దగ్గర సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చలో చండీఘర్ పిలుపులో భాగంగా సిఐటియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా నిరసన తెలిపారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ,నగర నాయకులు టి. రాముడు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగాలన్నింటినీ ప్రైవేటుపరం చేయడంలో దూకుడును పెంచిందన్నారు. బడా పెట్టుబడిదారులకు ఊడిగం చేసే విధంగా విధానాలను తీసుకువస్తున్నదన్నారు. అందులో భాగంగానే చండీఘర్ రాష్ట్ర డిస్కంను ప్రయివేటు సంస్థ అయినా ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కు అమ్మడానికి డిసెంబర్ 4న ఆ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పంజాబ్ ,హర్యానా రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం ఇది లాభాలు గడించే బంగారు బాతుగా చండీఘర్ డిస్కం ఉన్నదన్నారు. ఈ డిస్కంలో 500 మంది పర్మినెంట్ ఉద్యోగులు, 500 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం మంచి లాభాలు గడిస్తూ రూ.250 కోట్ల నుండి రూ.360 కోట్ల వరకు ప్రభుత్వానికి లాభాలు అందించిందన్నారు. లాభాలు గడిస్తున్నటువంటి ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థను ఆదానీ వంటి కార్పొరేటు శక్తులకు కారు చౌకగా రూ.174 కోట్లకు అప్పజెప్పాలని దుర్మార్గంగా ఆలోచిస్తున్నదన్నారు. చండీఘర్ డిస్కం సంబంధించిన భూముల రికార్డులు దొరకలేదని వంకతో నెలకు ఒక్క ఎకరా భూమి విలువ ఒక రూపాయి మాత్రమే చెల్లించాలని విలువ నిర్ణయించిందన్నారు. సంస్థ విలువ నిర్ణయించడానికి కాగ్, కేంద్ర విద్యుత్ రెగ్యులేటరీ సంస్థ సహాయం తీసుకోవాలని పలు సంఘాల సలహాలు ఇచ్చినా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కంపెనీ ప్రైవేట్ సంస్థకు కారు చౌకగా కట్టబెట్టడానికి బిజెపి మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదన్నారు. దేశంలోని పవర్ గ్రేడ్ సబ్‌స్టేషన్లను గుంప గుత్తగా ప్రయివేటుకు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి సబ్సిడీలు ఎత్తివేసే విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచడానికి రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. చండీగర్ తర్వాత యూపీలోనే ఆగ్రా , వారణాసి, తెలంగాణలోని హైదరాబాద్ దక్షిణ డిస్కంలను కూడా ప్రైవేటుకు అమ్మాలని నిర్ణయించిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ప్రవేటీకరణను ఆపాలని, లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రజల సమీకరించి పోరాటం చేస్తామనికేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్, ఎస్ఎండి. మహమ్మద్ రఫీ, కె.సుధాకరప్ప, మనోహర్, నగర నాయకులు ఎస్.మాలిక్, కర్ణ, భీసన్న డి.గోపాల్, విజయ్, చాంద్ బాషా, ఎస్ గోపాల్, హుస్సేన్ బాష పాల్గొన్నారు.

పోలీసులు కేసు నమోదు చేయలేదు...

- మంత్రాలయం -బెంగళూరు రహదారిపై రాస్తారోకో

ప్రజాశక్తి-తుగ్గిలి

విద్యుద్ఘాతానికి మృతి చెందిన వ్యక్తికి న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని మంత్రాలయం - బెంగళూరు రహదారిపై బుధవారం రాస్తారోకో చేశారు. జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన రామాంజనేయులు (22) కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. గొర్రెల కాపరిగా ఉన్న రామాంజనేయులు జాంప్లతండా సమీపంలోనే వ్యవసాయ పొలాల్లో గొర్రెల మేపుకుంటూ కంది పంట కోసే మిషన్ పై ఎక్కడంతో కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇందుకు బాధ్యులయిన విద్యుత్ శాఖ అధికారులపై కేసు నమోదు చేయాలని జొన్నగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించకపోవడంతో మంత్రాలయం - బెంగళూరు రహదారిపై కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న పత్తికొండ రూరల్ సిఐ పులి శేఖర్ సంఘటనా స్థలానికి వచ్చి విద్యుత్ శాఖ అధికారులపై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కరెంటు తీగలు తగిలి మతి చెందిన రామాంజనేయులు కు 18 నెలల క్రితం వివాహమైందని, చిన్న పిల్లాడు, భార్య ఉన్నారన్నారు.

రాస్తారోకో నిర్వహిస్తున్న బాధితులు, బంధువులు

ఘనంగా క్రిస్మస్ ర్యాలీ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఏసుక్రీస్తు పుట్టుకను పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పేరుతో జరుపుకుంటున్న క్రిస్మస్ పర్వదినాన నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలోని జయరాంనగర్‌లోని హెర్మోన్ క్రిస్టియన్ బ్రదరన్ అసెంబ్లీ ప్రార్థనా మందిరం నుంచి పాస్టర్ డి.జాన్ మోజస్ ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. క్రీస్తును ఆరాధిస్తూ, క్రిస్మస్ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ర్యాలీ సాగింది. అందంగా అలంకరించిన ఒక వాహనంలో సంగీత బృందం పాటలు పాడుతుండగా, జాన్ జోనాథన్ ఆధ్వర్యంలోని యువ బృందం జయధ్వానాలు పలుకుతూ ర్యాలీ సాగింది. కళ్యాణ్, జెసిల్‌లు పాడిన ఆధ్యాత్మిక గీతాలకు కీబోర్డుపై డాక్టర్ హడ్సన్, రిథమ్స్ పై రవిబాబు సహకరించారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

కర్నూలు నగరంలో ర్యాలీ ముందుబాగాన మ్యూజికల్ బృందం

కర్నూలు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

దారిలో డంప్ యార్డ్ నిర్మాణం

మార్కింగ్ వేసిన ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు -వ్యతిరేకిస్తున్న రైతులు కూలీలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో డంప్ యార్డ్ నిర్మాణానికి పొలాలకు వెళ్లే రహదారిపై ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు మార్కింగ్ వేయడం సర్వత్ర విమర్శలకు దారి తీస్తోంది. కర్నూలు నుంచి అనుగొండకు వెళ్లే ప్రధాన రహదారికి ఒకవైపున వాగు సమీపంలో డంపుయార్డ్ నిర్మించాలని అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా వాగుమీదుగా సుమారు 250 ఎకరాలకు పైగా సాగుపొలాలకు వెళ్లే పసులోడా రహదారిని మూసివేసే దిశగా అధికారుల చర్యలు ఉన్నాయి. ఈ అంశంపై ఇప్పటికే కొందరు రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిసి అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అక్కడ తమకు పట్టా పొలం మిగిలి ఉన్నదని, అందులో డంప్‌యార్డ్ నిర్మాణం చేస్తే చాలా ఇబ్బందికరమైన సమస్యలు ఎదురవుతాయన్నారు. పొలాలకు వెళ్లేందుకు పనులు చేసేందుకు కూలీలు ఎవరూ రారని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉన్న ప్రాంతాన్ని ఎంపిక చేయాలని రైతులు ప్రజలు కోరుతున్నారు.

డండ్‌యార్డు నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చిన అధికారులు

డంపు యార్డ్ నిర్మాణం ప్రజలకు ఇబ్బందికరం

- రమణ గౌడ్ రైతు బొల్లవరం

బొల్లవరం గ్రామ శివారులో రహదారిని ఆక్రమించి డంపు యార్డు నిర్మాణం రైతులకు ప్రజలకు ఇబ్బందికరం. దీనివల్ల దుర్వాసన రావడం పొలంలో పనిచేస్తున్న వారికి పొగ చూరి అనారోగ్యం పాలు అవుతారు. రహదారి మీదుగా వెళ్లే రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. తక్షణమే డంపు యార్డ్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

రాకపోగాలకు తీవ్ర అంతరాయం - ఖాజా హుస్సేన్ రైతు బొల్లవరం

వాగు బ్రిడ్జి వద్ద నుంచి పసలూడా దారి మీదుగా సుమారు 250 ఎకరాల సాగు పొలాలకు రైతులు కూలీలు వెళుంటారు.ఎద్దుల బండ్లు ట్రాక్టర్లు పశువులు ఆ దారిలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతాయి. దీనిని దృష్టిలోఉంచుకుని అధికారులు డంప్‌యార్డు నిర్మాణాన్ని ఆపివేయాలి.

వాజ్‌పేయికి ఘననివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారతదేశ మాజీ ప్రధాని కీర్తిశేషులు వాజ్‌పేయి అందరికీ ఆదర్శమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర తెలిపారు. బుధవారం కర్నూలు 46వ వార్డు నరసింహారెడ్డి నగర్ తన కార్యాలయంలో వాజ్ పేయి శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వాజ్‌పేయి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారన్నారు. లోకేశ్వరయ్య, రామాంజనేయులు, శివయ్య శెట్టి, శ్రీనివాసులు, శ్రీనివాసులు మహేష్, పర్ల శివ, ఆయుబ్, ఖాన్, కత్రినా జావీద్ పాల్గొన్నారు.

వాజ్‌పేయికి నివాళి అర్పిస్తున్న రాఘవేంద్ర

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆయా మండలాలు, కర్నూలులోని చర్చిలలో క్రిష్టయన్లు రోజంగా ప్రత్యేక ప్రార్థలు చేశారు. ప్రముఖ ఎవాంగలిస్టులు, పాస్టర్లు సందేశాలిచ్చారు. క్రీస్తు మార్గం సత్యమైనది, అనునిత్యమూ అనుసరణీయమని చెప్పారు.

క్రీస్తు మార్గం సత్యమైనది-డాక్టర్ బి. స్టీఫెన్ చార్లెస్

క్రీస్తు మార్గం సత్యమైనది, అను నిత్యమూ అనుసరింప తగినదని యెహూవా షమ్మ చర్చి పాస్టర్ డాక్టర్ బి. స్టీఫెన్ చార్లెస్ అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా నగరంలోని అన్ని ప్రార్థనాలయాలలో క్రిస్మస్ ఆరాధనను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆర్ఎస్ రోడ్డు కూడలిలోని యెహోవా షమ్మా చర్చిలో పాస్టర్ బి.స్టీఫెన్ చార్లెస్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. గాయక బృందం జయంతి, హెప్సి, శిరీష, ఝాన్సి, సురేఖ ప్రత్యేక గీతాలు ఆలపించారు. ఆర్‌సిఎం చర్చిలో ఫాదర్ గోరంట్ల జాన్ వెస్లి క్రిస్మస్ ప్రాశస్త్యాన్ని వివరించారు. కోల్స్ సెంటీనియల్ తెలుగు బ్యాప్టిస్ట్ చర్చిలో పాస్టర్లు జీవన్ రావు, అనిల్ వాక్యం బోధించారు. హోసన్నా మందిరంలో పాస్టర్ ఫ్రెడ్డి పాల్ వాక్య పరిచర్య చేసారు. సి క్యాంప్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ గంటా కరుణసాగర్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. మొత్తానికి జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ ఆరాధనను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు.

స్థానిక ఆర్ఎస్ రోడ్డు కూడలిలో గల రాక్ వుడ్ చర్చిలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. చర్చి సెక్రటరీ డాక్టర్ స్వరూప్ సిన్హా ,సురేష్, సంగీత బృందం శ్రావ్యమయిన భక్తి గీతాలు ఆలపించారు. ప్రత్యేక ప్రార్థనలు చైర్మన్ ఆనందరావు, రాబర్ట్, విజయ లక్ష్మి, శిల్పా కిషోర్ వయోల సిన్హా నిర్వహించారు. క్రీస్తు రాకడ, మానవాళి పాప విమోచన కోసమే అని క్రిస్మస్ సందేశాన్ని రెవరెండ్ జి.కిషోర్ కుమార్ అందించారు. కేక్ కట్ చేసి పాస్టర్లు వచ్చిన వారందరికీ అందజేశారు. సీనియర్ ఇంగ్లీష్ పాస్టర్ ఆర్. డేనియల్ సాధును చర్చి కార్యవర్గం సత్కరించింది.

రాక్‌వుడ్ చర్చిలో పాస్టర్ డేనియల్‌కు సన్మానిస్తున్న నిర్వహాకులు

క్రీస్తు జననం మానవాళికి ఆనందకరం

వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్‌రెడ్డి

కర్నూలు హాస్పిటల్ : క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి నగరంలోని సిఎస్ఐ చర్చి, స్టాంటన్ చర్చి, హోసన్నా మందిరం, కోల్స్ సెంటీనియల్ చర్చిలలో సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మానవాళిని సన్మార్గంలో నడిపించడానికి ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడని, ఆయన అందించిన శాంతి సందేశం మానవులలోని దుర్గుణాలు నశించి మంచి ప్రవర్తనను అలవర్చుకున్నారని తెలిపారు. సామూహిక ప్రార్థనలకు వచ్చిన క్రైస్తవ సోదరులకు అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సి.బెళగల్ : సి బెళగల్ మండలంలోని ప్రతి గ్రామంలో చర్చిలలో క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు ఆరాధన ప్రార్థనలతో సంబరాలను చేసుకున్నారు. పాస్టర్లు పోలకల్‌లో జాన్ మోజెస్, సి బెళగల్ లో చంద్రశేఖర్, కంభదహాల్‌లో వెంకట్రాముడు, గుండ్రవులలో బాబు, బ్రాహ్మణ దొడ్డిలో సిమోను, పలదొడ్డిలో ఆనందరాజు, గొల్లలదొడ్డిలో శాంసను క్రీస్తు సందేశమిచ్చారు. నెల రోజుల నుండె చర్చిలను అలంకరించి ఈ క్రిస్మస్ రోజున క్రైస్తవులు కొత్త వస్త్రాలు ధరించి, పిండి వంటలు చేసుకొని, ఇంటిల్లి పాదిని బంధువులతో సందడి సందడిగా కలిసి పార్థన మందిరాల్లో కలిసిశారు. శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గూడూరు చర్చిలో క్రిస్మస్ సందేశం ఇస్తున్న పాస్టర్లు, హాజరయిన క్రైస్తవులు

గూడూరు : ఎబిఎన్ చర్చి 129 సంవత్సరాలు పూర్తి చేసుకుని 130లోకి అడుగుపెట్టిన క్రిస్మస్ పండుగను ఎంతో ఘనంగా సంఘ కాపరి యోహాన్ సంఘ సెక్రెటరీ రాజశేఖర్, సంఘ ట్రెజరర్ కె. కిషోర్, సంఘ పెద్దలు ఎం.దానమన్న, బి సుందరాజు, దేవరాజు, దేవదానం, కె. దేవదానం , కె. రాజు బి సుంకయ్య, ఈ దానం, ఎం.సామ్సన్ , దాస్, సంఘంలోని పురుషులు స్త్రీలు చిన్నపిల్లలు ఆనందంతో క్రిస్మస్ పండుగ జరుపుకొని గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

తుగ్గలి: మండలంలోని పలు గ్రామాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. తుగ్గలి,పగిడిరాయి, చెన్నంపల్లి, రాతన, జొన్నగిరి, ఎద్దులదొడ్డి, పెండేకల్ తదితర గ్రామాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పగిడిరాయి మాజీ సర్పంచి జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

సి బెళగల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

కర్నూలు నగరంలోని చర్చిలో పాస్టర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్.వి.మోహన్‌రెడ్డి

2025 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కురువ సంఘం నాయకులు ం

కురువ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు జిల్లా కురవ సంఘం 2025 క్యాలెండర్‌ను కర్నూలు ఎంపి కార్యాలయం ప్రాంగణం లో జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎం కె.రంగస్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రదాన కార్యదర్శి అనిత, కురువ సంఘం నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పత్తికొండ శ్రీనివాసులు మాట్లాడుతూ కురువ కులస్తులందరూ ఐక్యంగా ఉండాలని, పిల్లలను చదివించాలని ఐక్యమత్యంతో ఉంటే అన్ని సాధించుకుంటారని ఏ సమస్య వచ్చినా కమిటీ సభ్యులు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, డైరెక్టర్, యుగంధర్ ప్రసాద్,ఉపాధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు, పెద్దపాడు ధనుంజయ, కె.దేవేంద్ర కోశాధికారి కెసి నాగన్న, పాల సుంకన్న, బిసి.తిరుపాలు, బి.రామకృష్ణ, కె.సోమన్న, వెంకటేశ్వర్లు, చిరంజీవి, రాజశేఖర్, పాపారాయుడు, దివాకర్, తేజస్విని, లక్ష్మన్న, చిన్నయ్య, నాగశేషులు, రఘు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి-మద్దికేర

వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా మద్దికేర కు చెందిన రాష్ట్ర ఇరిగేషన్ మాజీ డైరెక్టర్ ఆర్ .వెంకటేశ్వర్లును నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు ఇచ్చింది. ఈనేపథ్యంలో కొత్తగా ఎస్‌సిసెల్ అధ్యక్షుడిగా నియమించిన వెంకటేశ్వర్లను మండలంలోని వైసిపి నాయకులు తెరివేటి పకీరప్ప, రామాంజనేయులు, గంపల వెంకటేష్ పూలమాలలు వేసి సన్మానించారు. వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తనను గుర్తించి పార్టీలోజిల్లా స్థాయి పదవి బాధ్యతలు ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎస్‌సిలు వైసిపి వైపు వచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. మాజీ సిఎం వైయస్ జగన్ మోహన్‌రెడ్డి దళితుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. భవిష్యత్తులో కూడా జగన్‌తోనే ఉండి దళితులసంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తమపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు శక్తి వంచన లేకుండా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలి
- యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, పాపయ్య

ప్రజాశక్తి - ఆదోని

జనవరి 5 నుంచి 8 వరకు జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, పాపయ్య కోరారు. బుధవారం యుటిఎఫ్ కార్యాలయంలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యుటిఎఫ్ ఏర్పడి 50 ఏళ్ల పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసినట్లు చెప్పారు. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయాల్లో, వరదల సమయంలో, కరోనా సమయంలో రూ.5 కోట్లతో ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేసినట్లు తెలిపారు. జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో కాకినాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు జీవిత, జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, జిల్లా అకాడమిక్ కన్వీనర్ నర్సయ్య గౌడ్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు మల్లయ్య, పెద్దయ్య, లింగన్న, నాగేంద్ర, శివకుమార్ గౌడ్, సిద్దప్ప, బాబు, కృష్ణుడు, రాముడు, ఆవుల బసప్ప, రాజహంసేన్, ఈరన్న ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 29, 30న ఎమ్మిగనూరులో నిర్వహించే సిపిఎం 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, ఎమ్మిగనూరు కార్యదర్శి పి.గోవిందు కోరారు. బుధవారం బహిరంగ సభ, ప్రదర్శన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 29న (ఆదివారం) కొత్త మున్సిపల్ కార్యాలయం నుంచి కూరగాయల మార్కెట్, శ్రీనివాస్ టాకీస్, తేరు బజార్, నీలకంఠేశ్వర దేవాలయం, షరాఫ్ బజార్, గాంధీ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాత తహశీల్దార్ కార్యాలయం ముందు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభలో పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, యువజనులు, ఉద్యోగులు, బహుజనులు, మేధావులు పాల్గొనాలని తెలిపారు. సిపిఎం నాయకులు గురుశేఖర్, హనుమంతు, రాముడు, లక్ష్మీనరసయ్య, రవి, కృష్ణ మోహన్, శీను పాల్గొన్నారు.

గోడపత్రికలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

వైభవంగా ఉరుసు ఉత్సవాలు
- నాయకుల సందడి

ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి 11వ పీఠాధిపతి శ్రీసాని ఖాదర్ లింగస్వామి ఉరుసు ఉత్సవాలు వైభవంగా సాగాయి. బుధవారం కురుగోడులో వేలాది మంది భక్తుల సమక్షంలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి టిడిపి, వైసిపి నాయకులు రావడంతో సందడి నెలకొంది. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, మాజీ ఎంపిటిసి చౌదరి జనవరాజు, రాజానందు, కురుగోడు, సిద్దు, వైసిపి నాయకులు వైస్ ఎంపిపి నాయకులు రామలింగయ్య స్వామి, వడ్డే రాముడు, మహేంద్ర, మహ్మద్ తదితరులు వేర్వేరుగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వీరికి దర్గా ధర్మకర్తలు జైనుల్ అబుద్దీన్ మున్నా పాషా, చిన్న మున్నా పాషా, సయ్యదుద్దీన్ బాషా సన్మానించి ప్రసాదాలను అందజేశారు.

మళ్లీ తాత్కాలికమేనా..?

బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

- శిథిలావస్థకు చేరిన బసాపురం ట్యాంకు
- మరమ్మతుల కోసం రూ.60 లక్షలతో ప్రతిపాదనలు..!
- వేసవిలో నీటి సమస్య తప్పదా..?

గత నాలుగు సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరుకున్న బసాపురం ఎస్-ఎస్ ట్యాంకు నిర్మాణం పనులు మళ్లీ తాత్కాలికానికే పరిమితమయ్యాయి. ఈ వేసవిలో ఎలాగైనా ఆదోని పట్టణ ప్రజలకు తాగునీరందించాలని శిథిలావస్థలో ఉన్న ఎస్ఎస్ ట్యాంకు తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. మరోసారి రూ.60 లక్షలతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతున్నట్లు ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

ప్రజాశక్తి - ఆదోని

గతేడాది ఇదే సమయంలో బసాపురం ట్యాంకులో నీటి నిల్వ కోసం సుమారు 40 వేల ఇసుక సంచులతో చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఆ ఇసుక సంచులు మొత్తం పగిలిపోవడంతో సమస్య మొదటికి వచ్చింది. మళ్లీ పనుల కోసం రూ.60 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శాశ్వత మరమ్మతుల మాట మాత్రం అటు ఎమ్మెల్యే కానీ, ఇటు మున్సిపల్ అధికారులు కానీ మాట్లాడడం లేదు. ట్యాంకు శాశ్వత మరమ్మతుల కోసం రూ.35 కోట్ల మేర ఖర్చవుతుందని జగన్ ప్రభుత్వంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అప్పట్లో ఆ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ వ్యయం ఇప్పుడు రూ.50 కోట్లకు చేరింది. ఇప్పుడు కూడా శాశ్వత మరమ్మతుల కోసం ప్రభుత్వాలు అడుగులు వేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత నాలుగు సంవత్సరాలుగా ఉన్న బసాపురం సమస్య అక్కడికే వచ్చింది. ఆదోని పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించాలని 2002లో అప్పటి టిడిపి ప్రభుత్వం రూ.35 కోట్లతో ఈ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేసి భూములు కొనుగోలు చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిర్మాణాన్ని 2005లో ప్రారంభించి 2007లో పూర్తి చేసింది. నిర్మాణంలో రాయి రివిటెంట్‌కు బదులుగా సిసి లైనింగ్ పూర్తిస్థాయిలో ఎస్ఎస్ ట్యాంకు వేయడం వల్ల నేడు ఆ సిసి లైనింగ్ కుంగిపోయింది. ట్యాంకు లైనింగ్ మొత్తం పడిపోవడంతో ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. అప్పట్లో ఈ రాయి రివిట్‌మెంట్‌ను మార్చి సిసి లైనింగ్ వేయడానికి కాంట్రాక్టర్ అప్పటి కాంగ్రెస్ పార్టీలో పైస్థాయిలో ప్రయత్నించి రూ.లక్షల్లో చేతులు మార్చి సిసి లైనింగ్ చేతులు దులుపుకున్నారు. అదే సమయంలో అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలో ప్రజల కోసం నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు రాయి రివిట్‌మెంట్‌తో నిర్మించడంతో నేటికీ చెక్కుచెదరలేదు. 2020లో వచ్చిన భారీ వర్షాల వల్ల ఎస్ఎస్ ట్యాంకు ఒక పక్క నుంచి సిసి లైనింగ్ దెబ్బతినడం వల్ల ఏడాదికి లైనింగ్ పడిపోయింది. నేడు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకుంది. గత మూడు సంవత్సరాలుగా ట్యాంకు మరమ్మతుల పేరిట సుమారు రూ.3.5 కోట్లు అప్పటి పాలకులు నీటిపాలు చేశారు. కనీసం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా శాశ్వత నిర్మాణం చేస్తారని ఎదురు చూస్తే వారి హామీలు కూడా నీటి మూటలే అయ్యాయి. తిరిగి ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతుల కోసం రూ.60 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు.

వేసవి నీటి కష్టం పరిష్కారానికి అడుగులు

పట్టణంలోని 42 వార్డుల్లోని 2.5 మందికి తాగునీరు అందించేందుకు 24 వేల కుళాయిలు ఉన్నాయి. రోజూ పట్టణ ప్రజలకు 25 నుంచి 26 ఎంఎల్‌డిల తాగునీరు అవసరం. బసాపురం ట్యాంకులో 3,110 ఎంఎల్ నీరు నింపాల్సి ఉండగా ప్రస్తుతం ఇందులో సగం మాత్రమే నిల్వ ఉన్నాయి. మరో 10 శాతం నీరు ఇందులో నిల్వ చేస్తారు. వేసవిలో నీటి సమస్య రాకుండా రామజల నీటి పథకాన్ని కూడా వినియోగించుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న రామజల చెరువులోని నీటిని వినియోగానికి ఇప్పటికే అధికారులు చర్యలు చేపట్టి రామజలలో నిల్వ ఉన్న నీటిని మొత్తం తోడేశారు. ప్రస్తుతం తుంగభద్ర దిగువ కాలువ నుంచి రామజలకు నీటిని నింపుతున్నారు.

నిరసన చేపడుతున్న నాయకులు

విద్యుత్ చార్జీలను తగ్గించాలి
- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఆలూరు

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆలూరులో రాస్తారోకో చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు, సిఐటియు నాయకులు షాకీర్, కృష్ణ, నాగరాజు, వీరేష్ పాల్గొన్నారు.

ఎస్టీలు లేనప్పుడు రోస్టర్ ఎలా ఇస్తారు..?
- తహశీల్దార్‌కు కొట్టాల గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని ఎం.కొట్టాల గ్రామం లో ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో రేషన్ షాపు నెంబర్ 1325025కు గ్రామంలో ఎస్టీలు లేనప్పుడు రోస్టర్‌ను ఎలా కేటాయిస్తారని ఎం.కొట్టాల గ్రామస్తులు పత్తికొండ రాజు, రామాంజినేయులు ప్రశ్నించారు. మంగళవారం తహశీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ గ్రామంలో ఎస్సీ, బీసీ వర్గాల జనాభా మాత్రమే ఉన్నారని, అలాంటప్పుడు ఎస్టీలకు ఎలా రిజర్వ్ చేస్తారని ప్రశ్నించారు. అధికారులు మరోసారి ఆలోచించి రోస్టర్‌ను ఎస్సీగా మార్పు చేయాలని కోరారు. దాసప్ప, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఘనంగా మారికాంబ దేవి దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని కరణి, తిప్పలదొడ్డి, చూడి, మరళి, గుడికంబాళి, కుంభాలనూరు, మేళిగనూరు గ్రామాల్లో మారికాంబ దేవి దేవర ఉత్సవాలు ఘనంగా సాగాయి. బుధవారం ఆయా గ్రామాల్లో జరిగిన ఉత్సవాల్లో గ్రామస్తులు కుంభాలతో వెళ్లి గ్రామ దేవతకు పూజలు చేశారు. ఈ గ్రామాల్లో ప్రతి ఇంటికీ బంధువులు, స్నేహితులు రావడంతో పండగ వాతావరణం నెలకొంది. తమ అభిమాన పార్టీ నాయకుల ఫ్లెక్సీలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు.

నాయకుల సందడి : గ్రామాల్లో దేవర ఉత్సవాల్లో నాయకుల సందడి నెలకొంది. గ్రామస్తులు తమ పార్టీ నాయకులకు ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి తనయుడు దివాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, కొట్రేష్ గౌడ్, కురుగోడు, మరోవైపు టిడిపి సీనియర్ నాయకుని తనయుడు సతీష్ నాయుడు, శివ, రామలింగ, ముత్తన్న, లింగేషి, మూర్తి తదితరులు వేర్వేరుగా గ్రామ దేవతలను దర్శించుకుని పూజలు చేశారు.


దేవర ఉత్సవాల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

'జల జీవన్'.. ఇష్టానుసారం..!

- జల జీవన్ మిషన్ పనులతో ప్రజలకు ఇబ్బందులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి - నందవరం

జల జీవన్ మిషన్ పనులను ఇష్టానుసారంగా చేపడుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పనులను పర్యవేక్షించాల్సిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, సక్రమంగా చేపట్టాల్సిన కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు...

నందవరం గ్రామంలో జల జీవన్ మిషన్ పనులను ఒక పద్ధతి ప్రకారం కాకుండా.. ప్రజల అభిప్రాయాలతో అవసరం లేకుండా ఇష్టానుసారంగా చేపడుతున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు పనులను ఇష్టానుసారంగా చేపట్టి.. రోడ్లను దుర్భరంగా మార్చారు. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

దుర్భరంగా రోడ్లు...

కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా తవ్వడం వల్ల రోడ్లు దుర్భరంగా తయారయ్యాయి. వీధిలో జల జీవన్ మిషన్ పనుల కోసం కాంట్రాక్టర్లు వీధిలో రోడ్లను ఇష్టానుసారంగా తవ్వారు. ఈ రోడ్డు మార్గంలో పాఠశాల ఉంది. ఆ పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ రోడ్డు మార్గంలో చిన్న పిల్లలు వెళ్లాలంటే ఇబ్బందికి గురవుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లాలంటే ప్రధాన మార్గం ఇదే. రోడ్లను తవ్వి గుంతలమయంగా తయారు చేశారు. సమస్య పరిష్కారం కోసం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, కాంట్రాక్టర్లకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వీధిలోని కాలువల్లో మురుగు నిండి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ మురుగు నిండడం వల్ల కాలనీ వాసులు అనారోగ్యానికి గురవుతున్నారు.

గుంతలమయంగా మారిన రోడ్డు

స్పీడ్ బ్రేకర్ వల్ల ఇబ్బందులు

కోట వీధిలో ప్రజలు సంచరించే ప్రధాన రోడ్డు మార్గంలో కనీస అవగాహన లేకుండా జల జీవన్ మిషన్ కాంట్రాక్టర్లు పైపు లైన్ వేసి స్పీడ్ బ్రేకర్‌ను వేశారు. ఈ స్పీడ్ బ్రేకర్ భారీగా.. వీధి ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఉంది. స్పీడ్ బ్రేకర్‌ను ఒక పద్ధతి ప్రకారం కాకుండా వాహనాలు తిప్పుకోవడానికి వీల్లేని విధంగా వేశారు. వీధి ప్రజలు స్కూటర్లపై వెళ్లి స్పీడ్ బ్రేకర్ దగ్గర ఇబ్బందులకు గురయి పడిపోయిన సంఘటనలూ ఉన్నాయి. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, వారికి ముఖ్యమైన వ్యక్తుల ఇంటి దగ్గర మెప్పు కోసం.. వారికి నచ్చిన విధంగా కాంట్రాక్టర్లు పని చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా పైపు లైన్ వేయవద్దని, స్పీడ్ బ్రేకర్ వేయడం చేయవద్దు అని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైపు లైన్ పగిలినా పట్టించుకోవడం లేదు
- అజీజ, నందవరం

సుమారు మూడు నెలల క్రితం జల జీవన్ మిషన్ పనులను వీధిలో ప్రారంభించారు. అటువైపు పైపు లైన్ ఉందని మేము చెప్పినా కాంట్రాక్టర్లు మా మాట వినకుండా జెసిబితో తవ్వకాలు చేపట్టడంతో పైపు పగిలిపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు దానిని సరి చేయడం లేదు. అందులోని నీరు వృథాగా పోయి గుంత ఏర్పడి నీరు నిల్వ ఉంది. అందులోకి రెండుసార్లు మా పిల్లవాడు సైకిల్ వేసుకొని పడిపోయాడు. అధికారులు సందర్శించి వెళ్తారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదు.

పేరుకే ఆర్‌ఎంపి...

- ఎంబిబిఎస్, ఎమ్‌డి స్థాయిలో వైద్యం
- పైసలకు కక్కుర్తి పడి రోగులకు సలైన్ బాటిళ్లు...
- అధిక మోతాదు యాంటీ బయోటిక్స్ వేస్తున్న వైనం
- అమాయకుల ప్రాణాలతో చెలగాటం
- కన్నెత్తి చూడని జిల్లా వైద్యాధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ఓ ఆర్‌ఎంపి ఎంబిబిఎస్, ఎమ్‌డి స్థాయిలో వైద్యం చేస్తున్నాడు. పైసలకు కక్కుర్తి పడి అధిక మోతాదు గల యాంటీ బయోటిక్స్ మందులు వేస్తున్నాడు. అమాయకుల ప్రాణాలతో చలగాటమాడుతున్నాడు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంతో మండల ప్రజలు మండిపడుతున్నారు.

హోళగుంద మండలం హెబ్బటం గ్రామంలో శివ కుమార్ అనే ఆర్‌ఎంపి ఒక క్లినిక్ ఏర్పాటు చేసుకున్నారు. అందులో అధిక డోస్ గల వివిధ కంపెనీల యాంటీ బయోటిక్స్ దర్జాగా పెట్టుకుని ఎంబిబిఎస్, ఎమ్‌డి స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారు. అమాయక గ్రామీణ ప్రాంత ప్రజలతో చెలగాటమాడుతున్నారు. ఆర్‌ఎంపి అంటే రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీస్ అని అర్థం. ఈ ప్రాక్టీసుకు ఎంబిబిఎస్ వైద్యుల దగ్గర పది సంవత్సరాల పాటు పని చేసిన అనుభవంతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ఉండాలి. అప్పుడు మాత్రమే ఆ ఆర్‌ఎంపి రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. రోగులు జ్వరంతో బాధపడుతూ ఆర్‌ఎంపి దగ్గరికి వస్తే పారా సిటమల్, టాబ్లెట్ మాత్రమే ఇవ్వాలి. ఏదైనా ప్రమాదం జరిగి రక్త గాయాలతో వస్తే కట్టు కట్టి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు రెఫర్ చేయాలి. రోగులకు వైద్య సేవలు అందించాలంటే బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఉండాలని ప్రభుత్వ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. వాటిని తుంగలో తొక్కి ఇష్టానుసారంగా గొంతులో స్టెతస్కోప్, చేతిలో బిపి ఆపరేటర్ పెట్టుకుని తాను ఏర్పాటు చేసుకున్న క్లినిక్‌లో మంచం మీద రోగులకు సలైన్ బాటిళ్లు ఎక్కించడం, కాన్పులు చేయడం, సంతానం కలగని వారికి సంతాన సాఫల్యం కలిగిస్తామని అధిక మొత్తంలో పైసలు వసూలు చేస్తూ రోగులను నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు. ఆర్‌ఎంపి శివ కుమార్ ఎంబిబిఎస్, ఎమ్‌డి స్థాయిలో వైద్యం చేస్తూ 'నేనింతే.. నేను ఎవరికీ భయపడను.. నన్ను ఎవరూ.. ఏమీ చేసుకోలేరు' అంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు ఎందుకు ఇలాంటి ఆర్‌ఎంపిలపై చర్యలు తీసుకోలేకపోతున్నారనే ప్రశ్న అందరిలో ఉంది. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులకు సైతం అధిక మోతాదు గల యాంటీ బయోటిక్స్ వాడకం అలవాటు చేయడం ద్వారా ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఆ రోగి పరిస్థితి అంతే...

అధిక మోతాదు యాంటీ బయాటిక్స్ వాడితే

చిన్న, చిన్న రోగాలకు అధిక మోతాదు గల వివిధ కంపెనీల యాంటీ బయోటిక్స్ మందులు వాడితే ఇబ్బందులు తప్పవని నిపుణులు పేర్కొంటున్నారు. దీర్ఘకాలిక రోగాల బారిన పడినప్పుడు, ప్రమాదాలు సంభవించినప్పుడు, శస్త్ర చికిత్సలు చేయించుకున్నప్పుడు మాత్రమే యాంటీ బయోటిక్స్ మందులు వాడాలని సూచిస్తున్నారు. ఇలా చిన్న, చిన్న రోగాలకు వాడితే అప్పుడు యాంటీ బయోటిక్స్ మందులు పని చేయవు. ఆర్‌ఎంపిలు చేసిన పొరపాటుకు ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని వైద్యులు సూచిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా ఆర్‌ఎంపిలు

మండలంలో ఆర్‌ఎంపిలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. కనీసం పదో తరగతి కూడా పూర్తి చేసి ఉండరు. ఓ ఆర్‌ఎంపి దగ్గర ప్రాక్టీస్ చేసి అరకొర మందుల పేర్లు తెలుసుకొని సంపాదనే ధ్యేయంగా ఆర్‌ఎంపిలు పుట్టుకొస్తున్నారు.

ఈ విషయంపై ఆదోని ఇన్‌ఛార్జ్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ బాలమురళీని వివరణ కోరగా... ఆర్‌ఎంపిలు వైద్యం చేయరాదని, ప్రథమ చికిత్స చేయాలని తెలిపారు. వైద్యం చేసే వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపి శివ కుమార్

నిల్వ ఉంచిన మందులు

ఆర్‌ఎంపి ఎక్కించిన సెలైన్ బాటిళ్లు

ప్రజల ప్రాణాలకు ముప్పు
- సిఐటియు జిల్లా నాయకులు నారాయణస్వామి

ఆర్‌ఎంపిల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఉంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ త్వరగా రోగికి నయమయితే వారి దగ్గరికి వస్తారని అధిక మోతాదు గల యాంటీ బయోటిక్స్ మందులు అలవాటు చేస్తున్నారు. ఇలాంటి ఆర్‌ఎంపిలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకోవాలి. లేకపోతే సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


ఆదోని సిఎస్ఐ చర్చిలో బిషప్ వరప్రసాద్‌ను సన్మానిస్తున్న సంఘు పెద్దలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యుద్దీపాలంకరణతో చర్చీలు మెరిసిపోయాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో ఉన్న సిఎస్ఐ ఓల్డ్ ట్రినిటీ చర్చిలో పాస్టర్ భరత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలకు చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా రాయలసీమ డయాసిస్ బిషప్ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశం చేశారు. సోదర భావం కలిగి జీవించాలన్నారు. క్రీస్తు మార్గం గురించి అన్య జనాలకు తెలియజేయాలన్నారు. అనంతరం బిషప్ దంపతులను పూలమాల, శాలువాతో సన్మానించారు. సంఘ పెద్దలు డేవిడ్, విల్సన్, కట్టా స్వామి దాస్, సురేంద్రబాబు, ప్రభాకర్ ఉన్నారు.

కలవరి కొండ చర్చిలో

కల్వరి కొండ చర్చిలో పాస్టర్ ఆనందరాజు ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. క్రీస్తు పుట్టుక గురించి వాక్యోపదేశం చేశారు. బెరయ చర్చిలో పాస్టర్ బెనహర్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సీయోను చర్చి మండగిరి బాల ఏసు మందిరంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విక్టోరియా పేటలోని సిఎస్ఐ చర్చిలో సన్నాఫ్ సెక్రటరీ సునీల్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రార్థనలు నిర్వహించారు. **హోళగుంద**లోని పెనుయేలు ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ దేవదానం వాక్యోపదేశం చేశారు. చర్చీలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. **పెద్దకడబూరు** మండలంలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దకడబూరులోని సిఎస్ఐ పాస్టర్ రెవరెండ్ ముత్తుమనోహర్ బాబు, ఆర్‌సిఎం చర్చి ఫాదర్ రెవరెండ్ సంజీవ్ వాక్యోపదేశం చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, ఎల్ఎల్‌సి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నరవ రమాకాంత రెడ్డి, టిడిపి నాయకులు ఏసేపు, మల్లికార్జున, దశరథ రాముడులు సిఎస్ఐ, ఆర్‌సిఎం చర్చీలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలో క్రిస్మస్ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నేమకల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలోని చర్చిలో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫాదర్ సామియేలు మాట్లాడుతూ... సర్వ మానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన యుగకర్త క్రీస్తు జన్మదినం ఓ పండగలాంటిదని తెలిపారు. ప్రేమ మార్గంలో ఎవరి మనస్సునైనా జయించవచ్చని తన జీవితం ద్వారా నిరూపించిన క్రీస్తు మార్గంలో నడుస్తూ సాటి మనిషికి మేలు చేయాలని చెప్పారు. ప్రేమ, కరుణ, సహనం, దయ, త్యాగ గుణాలను అలవాటు చేసుకుని జీవితాన్ని శాంతిమయం చేసుకుందామని తెలిపారు. రంగస్వామి, చర్చి పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని దేవనకొండ, తెర్నేకల్లు, కరివేముల, కప్పట్రాళ్ల, కోటకొండ, గద్దెరాళ్ల, ఈదుల దేవరబండ, పొట్లపాడు, గుండ్లకొండ, వెలమకూరు తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చీలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు బైబిల్ పఠనం చేపట్టారు. బంధుమిత్రులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నేమకల్లు (చిప్పగిరి) చర్చిలో క్రిస్మస్ వేడుకలు

పెద్దకడబూరులో మాట్లాడుతున్న తిక్కారెడ్డి